సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం : 3 : నవంబర్ : 2023



మంచి దిగుబడి సాధించాలి
కాఫీ సాగులో గిరిజనులు మంచి దిగుబడులు సాధించి అధిక ఆదాయం పొందాలని కాఫీ బోర్డు ఏడీ అశోక్ సూచించారు. 4లో



ఘాట్‌రోడ్డులో ట్రాఫిక్ జామ్
అనంతగిరి ఘాట్‌రోడ్డులో అడ్డంగా లారీ నిలిచిపోవడంతో కాసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. 4లో



మన్యంలో చిరు జల్లులు
పాడేరు, జి.మాడుగుల, పెదబయలు మండలాల్లో గురువారం మధ్యాహ్నం చిరు జల్లులు కురిశాయి. మంచు దట్టంగా కురిసింది. 4లో

న్యూస్‌రీల్

నేడు రెండు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

అడ్డతీగల: జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాలు మార్చే ప్రక్రియ చేపడుతున్న దృష్ట్యా శుక్రవారం అడ్డతీగల, వై.రామవరం మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ మహ్మద్ యూసఫ్ తెలిపారు. అడ్డతీగల-ర ంపచోడవరం మండలాల సరిహద్దుల్లో జాతీయ రహదారికి అడ్డంగా ఉన్న స్తంభాల తొలగింపు పనుల వల్ల ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ రెండు మండలాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సమస్యను గుర్తించి సహకరించాలని ఆయన కోరారు.

ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ ఔదార్యం

- పేద యువతి వివాహానికి రూ.లక్ష ఆర్థికసాయం



రూ.లక్ష చెక్కును అందజేస్తున్న ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్

చింతూరు: జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద ముస్లిం యువతి వివాహానికి రూ.లక్ష విరాళాన్ని ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆడపిల్ల వివాహం తల్లిదండ్రులకు ఎంతో ఆర్థిక భారంగా మారిందన్నారు. తనకున్న ఆదాయ వనరుల్లో పేదలకు సాయం చేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రూ.లక్ష చెక్కును యువతి సోదరుడికి అందజేశారు. ముస్లిం పెద్దలు సుభాని, ఎజాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

అభ్యంతరాల స్వీకరణకు ప్రత్యేక శిబిరాలు

- జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్

పాడేరు రూరల్ : ఓటర్ జాబితా సవరణకు సంబంధించి ఈనెల 4,5 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ జె. శివశ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటరు జాబితాల్లో తప్పులు, పేర్ల తొలగింపు, ఫొటోలు సవరణకు ఫారం 6,7,8లను కేటాయించబడిన పోలింగ్ కేంద్రాల వద్ద డిసెంబర్ 9వ తేదీ వరకు స్వీకరిస్తారని తెలిపారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శులు వారి క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో దండోరా ద్వారా ప్రజలకు తెలియజేయాలని ఆయన సూచించారు.


నేడు అనంతగిరిలో జగనన్నకు చెబుదాం

సాక్షి,పాడేరు: అనంతగిరి మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 3వతేదీ శుక్రవారం జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అన్నిశాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన ఆదేశించారు. అనంతగిరి మండల పరిధిలోని ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యల పరిష్కారానికి వినతులు అందజేయాలన్నారు. ప్రత్యేక స్పందన ముగిసిన అనంతరం మధ్యాహ్నం రెండు గంటల తరువాత అన్నిశాఖల అధికారులు సంభందిత శాఖల క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్ష నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

నేటి ఐటీడీఏ స్పందన రద్దు

పాడేరు ఐటీడీఏలో శుక్రవారం జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి పాడేరు ఐటీడీఏకు రావొద్దని సూచించారు.

కందిరీగల దాడిలో వ్యక్తి మృతి



సత్తిబాబు మృతదేహం

హుకుంపేట: పెద్ద కందిరీగలు దాడిలో వ్యక్తి మృతి చెందాడు. కుటుంబసభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని భీమ వరం పంచాయతీ మద్దిపుట్టు గ్రామానికి చెందిన పాంగి సత్తిబాబు ఈనెల 31న తేనె సేకరించేందుకు సమీప అటవీప్రాంతంలోకి వెళ్లాడు. అక్కడ అతనిపై పెద్ద కందిరీగలు దాడి చేశాయి. అతనితో పాటు వెళ్లి కొందరు అతనిని వెంటనే మండలంలోని ఉప్ప ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య సేవలు పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందినట్టు భార్య కొండమ్మ తెలిపింది. మృతునికి ఆమెతోపాటు నలుగురు పిల్లలు ఉన్నారు. పోషించే పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబం పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ఆతిథ్యం అదుర్స్



వేదికపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్, రాష్ట్ర మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, అంబటి రాంబాబు, విడదల రజిని

- ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సదస్సుకు వేదికైన విశాఖ
- 90 దేశాల నుంచి 1,200 మంది ప్రతినిధులు హాజరు
- కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో కలిసి సదస్సు ప్రారంభించిన సీఎం జగన్
- పోలీస్ శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు

దొండపర్తి (విశాఖ): విశాఖ ఆతిథ్యం అదిరిపోయింది. విదేశీ ప్రతినిధులను మంత్రముగ్ధులను చేసింది. మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సదస్సుకు వేదికైన విశాఖ.. 90 దేశాలకు చెందిన 1200 విదేశీ ప్రముఖులకు ఘన స్వాగతం పలికింది. 25వ ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ కాంగ్రెస్ ప్లీనరీ తొలి రోజు సమావేశం గురువారం రాడిసన్ బ్లూ హోటల్‌లో విజయవంతంగా జరిగింది. కేంద్ర జలవనరుల శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ రాష్ట్రంలో అత్యాధునిక నీటి పారుదల విధానాలు, సాగునీటి రంగం, వ్యవసాయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. అలాగే కేంద్రం మంత్రి షెకావత్ ప్రధాని మోదీ నేతృత్వంలో నీటి సంరక్షణ, డ్యామ్‌ల పరిరక్షణ, నదుల అనుసంధానానికి చేపట్టిన ప్రణాళికలను విశదీకరించారు.

మంత్రముగ్ధులైన విదేశీ ప్రతినిధులు

ఐసీఐడీ సదస్సుకు వివిధ దేశాలకు చెందిన అంబాసిడర్లు, మంత్రులు, జలవనరుల రంగ నిపుణులు వచ్చారు. 57 ఏళ్ల తరువాత భారత్‌లో జరుగుతున్న ఈ అంతర్జాతీయ సదస్సుకు విశాఖ అతిథ్యమిచ్చింది. వివిధ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు విశాఖ అందాలను చూసి మంత్రముగ్ధులయ్యారు. రాడిసన్ బ్లూ హోటల్ వద్ద సందడి చేశారు. సదస్సులో కీలక ప్రసంగాలు, ప్రదర్శనలు అనంతరం ప్రతినిధులు బీచ్ అందాలకు ఫిదా అయిపోయారు. ఈ ప్రతినిధుల కోసం జిల్లా యంత్రాంగం చేసిన ఏర్పాట్లను చూసి వారు మురిసిపోయారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రతినిధులు బసచేసే హోటల్ నుంచి వారి రాడిసన్ బ్లూకు వచ్చే వారికి ప్రత్యేక బందోబస్తు కల్పించారు. దీంతో తొలి రోజు సదస్సు ప్రశాంతంగా ముగిసింది. ఈ నెల 8వ తేదీ వరకు ఈ సదస్సు జరగనుంది.



రాడిసన్ బ్లూ హోటల్‌లో విదేశీ ప్రతినిధులు



సెల్ఫీ తీసుకుంటున్న విదేశీ ప్రతినిధులు



సదస్సుకు హాజరైన విదేశీ ప్రతినిధులు

సీఎం జగన్‌కు ఘన స్వాగతం

గోపాలపట్నం (విశాఖ): ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఐసీఐడీ సదస్సు కోసం గురువారం ఉదయం 8.52 గంటలకు ప్రత్యేక విమానంలో చేరుకున్నారు. ఆయనతోపాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు వచ్చారు. ఇక్కడ నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ మాధవి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ ఘనంగా స్వాగతం పలికారు. అక్కడ నుంచి 9.08 గంటలకు హెలికాప్టర్‌లో మధురవాడ ఐటీ హిల్-3కు బయలుదేరారు. అక్కడ హెలిప్యాడ్ వద్ద సీఎంకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పోలీస్ కమిషనర్ రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ స్వాగతం పలికారు. అనంతరం అక్కడ వేచి ఉన్న వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, ఐసీడీఎస్ ప్రాంతీయ చైర్‌పర్సన్ మంతెన మాధవి, మాజీ ఎంపీ కిల్లి కృపారాణి, ప్రముఖ ఆడిటర్ జి.వెంకటేశ్వరరావు, ఇతర నాయకులను పేరుపేరున పలకరించారు. అనంతరం ఆయన రాడిసన్ హోటల్‌కు వెళ్లి సదస్సును ప్రారంభించారు. సదస్సు ముగిసిన తరువాత సీఎం మధ్యాహ్నం 11.55కు ఐటీ హిల్-3కు చేరుకున్నారు. అక్కడ మంత్రులు కొట్టు సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, అధికారులు సీఎంకు వీడ్కోలు పలికారు. హెలికాప్టర్‌లో విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకొని 12.22 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం బయలుదేరారు.



సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ కుంభా రవిబాబు

అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- పెదకోడాపల్లి- ఉర్రాడ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, స్థానిక ప్రజాప్రతినిధులు

సాక్షి,పాడేరు: అరకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు రోడ్లు, రవాణా సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. పెదబయలు మండలంలోని మారుమూల పెదకోడాపల్లి పంచాయతీ కేంద్రం నుంచి ఉర్రాడ గ్రామానికి వెళ్లే మూడున్నర కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.1.20 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిర్మాణ పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే పొక్లెయిన్‌తో మట్టి తొలగించి ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పంచాయతీ కేంద్రానికి శివారు గ్రామాలనుంచి రోడ్లు నిర్మించడమే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో రోడ్లు, గెడ్డలపై వంతెన నిర్మాణాలు జరగడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

56 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

పెదకోడాపల్లి పంచాయతీ మారుమూల ఉర్రాడ గ్రామానికి చెందిన 56 గిరిజన కుటుంబాలు గురువారం ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. బీజేపీకి చెందిన డి.రామన్న,కె.బంగారయ్య, టీడీపీ, సీపీఎంలకు చెందిన డి.కొండబాబు, కె.భీమన్న,బి.జగన్నాధం,వి.కొండబాబు తదితరులకు ఎమ్మెల్యే పాల్గుణ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. జైజగన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. గిరిజన ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. నవరత్నాల పథకాలతోను గిరిజనులకు మేలు జరుగుతుందన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సువర్ణ పాలన అందిస్తున్నారన్నారు. పాలనకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరేందుకు పలువురు ముందుకు రావడం శుభపరిణామన్నారు. ఎంపీపీ బొండా వరహాలమ్మ, జెడ్పీటీసీ కూడా బొంజుబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు వంతాల ఆనందరావు, ఎంపీటీసీ కోడా అప్పారావు, సర్పంచ్‌లు బట్టి చిట్టిబాబు, కాతరి సురేష్, పి.లోహితాష్, బొండ రాజు, బొరగం అప్పారావు, మాజీ జెడ్పీటీసీ గంగా భవాని పాల్గొన్నారు.



పలు పార్టీల నేతల కుటుంబాలను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

విధి నిర్వహణలో అప్రమత్తం

- రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహాల్లి
- వై.రామవరం పోలీసుస్టేషన్ సందర్శన



వై.రామవరం పోలీసుస్టేషన్‌ను సందర్శించిన ఏఎస్పీ జగదీష్ అడహాల్లి

వై.రామవరం: ఏవోబీలో మావోయిస్టుల కదలికలు లేకపోయినప్పటికీ విధుల నిర్వహణలో అప్రమతంగా ఉండాలని అధికారులు, సిబ్బందికి రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహాల్లి సూచించారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను గురువారం సందర్శించిన ఆయన రికార్డులను తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల వివరాలను తెలుసుకున్నారు. స్టేషన్ ఆవరణలోని సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అదనపు పోలీసు బలగాల సెంట్రీ పోస్టులు, వారికి కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. సమస్యలు తెలుసుకున్నారు. సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు, గంజాయి అక్రమ రవాణా, నాటుసారాకు అడ్డుకట్ట వేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, సిబ్బందితో చర్చించారు. ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పోలీసుస్టేషన్ నూతన భవనాన్ని పరిశీలించారు. భద్రత ఏర్పాట్లపై సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐ వై.రాంబాబు, ఎస్ఐ.ఎం సంతోష్‌కుమార్, అడిషనల్ ఎస్ఐ కె.రాంబాబు, ఏఎస్ఐలు సురేష్, సత్యనారాయణ, సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

వంజంగి కొండపై ఆంక్షలు

- ఈనెల 4 నుంచి కొండపైకి వాహనాల నిషేధం
- పార్కింగ్ ప్రాంతంలోనే నిలిపివేత
- కొండ దిగువ నుంచి ప్రైవేట్ వాహనాల్లో మాత్రమే రాకపోకలు
- ఒకొక్కరికి ఒక వైపు రూ.150 చార్జి



సమావేశమైన అధికారులు,గ్రామ పెద్దలు

సాక్షి, పాడేరు: వంజంగి కొండపైకి ఈనెల 4వతేదీ నుంచి పర్యాటకుల వాహనాలను నిషేధిస్తూ అధికారుల సమక్షంలో వంజంగి, ఇతర గ్రామాల తీర్మానించారు. గురువారం వంజంగి గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన కొత్త పార్కింగ్ స్థలం వద్ద ఎంపీడీవో నవీన్, ఎస్ఐ రంజిత్‌ల సమక్షంలో సమావేశం నిర్వహించారు. వంజంగి హిల్స్ ప్రాంతాన్ని సందర్శించే పర్యాటకులకు అందుబాటులో తేవాల్సిన సౌకర్యాలు, భద్రత చర్యలపై వారు సమీక్షించారు. వంజంగి హిల్స్‌కు వచ్చే వాహనాలను పార్కింగ్ ప్రాంతంలోనే పర్యాటకులు నిలిపివేయాలని, కొండమీదకు అనుమతి లేదని ఎంపీడీవో నవీన్ తెలిపారు. అలాగే పార్కింగ్ ప్రాంతంలో గేట్ పాస్ మాత్రమే వాహనానికి రూ.50 వసూలు చేస్తామన్నారు.ప్రైవేట్ జీపులు,ఆటోలు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న వంజంగి కొండపైకి నిరంతరం సర్వీసు చేస్తాయన్నారు. ఆయా వాహనాల్లో ఒకవైపు చార్జి మనిషికి రూ.150 వరకు వసూలు చేస్తారని ఎంపీడీవో తెలిపారు. ఈ సమావేశంలో పలు పంచాయతీల సర్పంచ్‌లు, వార్డు సభ్యులు,పాల్గొన్నారు.

ఏడు ఆర్‌ఎంపీ క్లినిక్‌ల సీజ్

చింతూరు: చింతూరులో ఏడు ఆర్‌ఎంపీల క్లినిక్‌లను గురువారం సీజ్ చేశారు. ఇటీవల కూనవరం మండలంలో నాలుగేళ్ల బాలుడు మృతి విషయంలో ఆర్‌ఎంపీల వైద్యంపై విమర్శలు వచ్చాయి.ఈ నేపథ్యంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, తహసీల్దార్ కారం సుబ్బారావు గురువారం చింతూరులో ఆర్‌ఎంపీ క్లినిక్‌లను తనిఖీ చేశారు. నిబంధలను ఉల్లంఘించిన క్లినిక్‌లపై చర్యలు తీసుకున్నారు.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం: పీవో కావూరి చైతన్య

ఆర్‌ఎంపీలు అర్హతకు మించి వైద్యం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఒక ప్రకటనలో హెచ్చరించారు. గ్రామాల్లోని ఆశా, ఏఎన్ఎం, ఇతర సిబ్బంది సేవలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు. డివిజన్ పరిధిలో పది పీహెచ్‌సీలు, రెండు సీహెచ్‌సీలు అందుబాటులో ఉన్నాయన్నారు. సరియైన అవగాహన లేని ఆర్‌ఎంపీల వద్ద చికిత్స చేయించుకుని ప్రాణాలమీదకు తెచ్చుకోవద్దని ఆయన ప్రజలకు సూచించారు.



ఆర్‌ఎంపీ క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, తహసీల్దార్

జిల్లాలో 46 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- రాగుల కొనుగోలుకు 24 కేంద్రాలు
- జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్

పాడేరు రూరల్ : జిల్లాలో 46 ధాన్యం కొనుగోలు కేంద్రాలు, 24 రాగుల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని జాయింట్ కలెక్టర్ జె. శివశ్రీనివాస్ తెలిపారు. గురువారం తన ఛాంబర్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలలో టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించాలని, కొనుగోలు ప్రక్రియకు ఈ క్రాప్ ద్వారా రైతులు వద్ద నుంచి నేరుగా కొనుగోలు చేయాలని సూచించారు. రైతులకు కావాల్సిన గోనె సంచులు, ధాన్యం రవాణకు వాహనాలను సిద్ధంగా ఉంచాలన్నారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు రవాణ చేసే వాహనాలకు కచ్చితంగా జీపీఎస్ అనుసంధానించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం, రాగులకు మద్దతు ధర ప్రకటించిందన్నారు. ధాన్యం మద్దతు ధర సాధారణ రకం క్వింటాకు రూ.2,183, గ్రేడ్ వన్ రకానికి రూ.2,203గా ప్రభుత్వం ధర నిర్ణయించిందన్నారు. రాగులు క్వింటా రూ.3,846లుగా నిర్ణయించారన్నారు. పంట కోతకు ముందు వివరాలు ఆర్‌బీకే కేంద్రాలలో తెలిపి షెడ్యూల్ చేయించుకోవాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలకు లోబడి ధాన్యం, రాగులు సిద్ధం చేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. జీపీఎస్ పరికరం అమర్చిన వాహనాల్లోనే రవాణా చేయాలని ఆదేశించారు. ఎఫ్‌టీవో చేతికందిన తర్వాత రైతు మిల్లుకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. మిల్లర్లు అన్లోడ్ చేయడానికి డబ్బులడిగితే ఆర్బీకే సిబ్బందికి లేదా టోల్‌ఫ్రీ నంబర్ 1967 నంబర్‌కు ఫిర్యాదు చేయాని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నందు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్యామ్‌కుమార్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గణేష్‌కుమార్, జిల్లా కోఆపరేటివ్ అధికారి ఎంపీ రత్నం, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్

మాతృ మరణాల నియంత్రణే లక్ష్యం



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



సమావేశంలో పాల్గొన్న పలుశాఖల అధికారులు

- ప్రతి గర్భిణిని బర్త్ వెయిటింగ్ హాల్‌కు తరలించాలి
- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం
- వైద్య సిబ్బందితో సమీక్ష

సాక్షి,పాడేరు: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రతి గర్భిణికి సుఖప్రసవాలు జరిపి, మాతృ మరణాల నియంత్రణ లక్ష్యంతో వైద్యబృందాలు పనిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గత ఏప్రిల్ నుంచి ఇంతవరకు జిల్లాలో చోటుచేసుకున్న ఎనిమిది మాతృమరణాలపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షించారు. ఆయా మరణాలకు గల కారణాలపై సంబంధించి వైద్య సిబ్బందిని విచారించారు. సకాలంలో గర్భిణులు స్పందించకపోవడం, అవగాహన లోపం, బర్త్ వెయిటింగ్ హాల్‌లను వినియోగించకోకపోవడం కారణాలుగా ఆయన విశ్లేషించారు. వారిలో చైతన్య తెచ్చిర మాతృమరణాలు జరగకుండా ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వైద్యులు, పారామెడికల్ వైద్యసిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి పెట్టి నిరంతరం వారి ఆరోగ్య పరిస్థితిని సమీక్షించడమే కాకుండా బర్త్ వెయిటింగ్ హాల్స్‌కు తరలించాలని ఆయన ఆదేశించారు. 108 వాహనాలు అందుబాటులో లేని పరిస్థితుల్లో తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను వినియోగించాలని సూచించారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఆస్పత్రుల్లో ప్రసవాలపై అవగాహన కల్పించాలని కోరారు. అంగన్‌వాడీల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు మాత్రమే వినియోగించేలా చూడాలన్నారు. గర్భిణులకు నిరంతరం బీపీతో పాటు హిమోగ్లోబిన్ పరీక్షలు జరపాలని, రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ బర్త్ వెయిటింగ్ హాల్స్‌కు గర్భిణులు నిరాకరించినా, అంబులెన్సులు స్పందించకపోయినా తన దృష్టికి తీసుకురావాలన్నారు.ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, కె.కృష్ణారావు,ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి,ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెందిన రాష్ట్ర సర్వైలెన్స్ మెడికల్ అధికారి డాక్టర్ జాన్ జ్యూడ్ జాషువా, డాక్టర్ హర్షిత్, సీడీపీవోలు,వైద్యులు,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాధాన్యత భవనాలను వేగవంతం చేయాలి

జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి గురువారం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు,ఎంపీడీవోలతో వీడియో సమావేశం నిర్వహించారు. భవనాలు పూర్తి చేసిన వారం రోజుల్లోనే బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. ఎఫ్‌టీవోలు జనరేట్ చేయడంలో జాప్యం, అవినీతికి పాల్పడితే తీవ్రమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. అడ్డతీగల, దేవీపట్నం, వై.రామవరం, జి.కే. వీధి, కొయ్యూరు, రంపచోడవరం, పాడేరు, రాజవొమ్మంగి మండలాల్లో పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. ఈ నెలాఖరుకు జిల్లాలో 11విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, 60 గ్రామ సచివాలయాలు, 51 రైతుభరోసా కేంద్రాల భవన నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్, రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, పిఐయూ ఈఈ లావణ్యకుమార్, పంచాయతీరాజ్ ఈఈ కొండయ్యపడాల్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంచి దిగుబడి సాధించాలి

- గిరి రైతులకు కాఫీ ఏడీ అశోక్ సూచన
- చింతపల్లి ఎకో పల్పింగ్ యూనిట్‌లో పండ్ల శుద్ధీకరణ పనులు ప్రారంభం



కాఫీ పండ్ల శుద్ధీకరణను పరిశీలిస్తున్న ఏడీ అశోక్, తదితరులు

చింతపల్లి రూరల్: కాఫీ సాగులో గిరిజనులు మంచి దిగుబడులు సాధించి అధిక ఆదాయం పొందాలని కాఫీ బోర్డు ఏడీ అశోక్ సూచించారు. గురువారం ఆయన చింతపల్లి ఎకో పల్పింగ్ యూనిట్ కేంద్రాన్ని సందర్శించారు. పల్పింగ్ కేంద్రంలో పండ్ల శుద్ధీకరణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది చింతపల్లి కాఫీ పరిశ్రమ ద్వారా 3,500 టన్నుల కాఫీ ఉత్పత్తిని లక్ష్యంగా చేసుకున్నామని తెలిపారు. కాఫీ బోర్డు ఇన్‌చార్జి డీడీ రమేష్, డీహెచ్‌వో రమేష్‌కుమార్‌రావు, డీఎంవో రహీమ్, హెచ్‌వో బాలకర్ణ, మాక్స్ సొసైటీ అధ్యక్షుడు సెగ్గి కొండలరావు పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డులో ట్రాఫిక్ జామ్

- అడ్డంగా నిలిచిన లారీ

అనంతగిరి: మండలంలోని అనంతగిరి ఘాట్‌రోడ్డు డైడా సమీపంలోని హెయిర్‌పిన్ బెండ్ మూడవ మలుపువద్ద రోడ్డుకు అడ్డంగా కర్రల లోడుతో వెళుతున్న లారీ నిలిచిపోయింది. దీంతో సుమారు ఆర గంటసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. అరకు నుంచి మైదాన ప్రాంతానికి కర్రల లోడుతో వెళుతున్న లారీ హెయిర్‌పిన్‌బెండ్ మూడవ మలుపువద్దకు వచ్చేసరికి మలుపుతిప్పే క్రమంలోని లారీ నిలిచిపోయింది. అధిక లోడు కారణంగా లారీ వెనక్కివచ్చేపరిస్థితి లేకపోవడంతో సుమారు ఆర గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. డ్రైవర్ చాక్యచాక్యంగా వ్యహరించడంతో లారీని మలుపునుంచి ముందుకు నడపడంతో వాహన రాకపోకలు సాగించాయి.

మన్యంలో చిరు జల్లులు

- ఉదయం 9 గంటల వరకు పొగమంచు
- మధ్యాహ్నం నుంచి వాతావరణంలో మార్పు
- రంపచోడవరం డివిజన్‌లో భారీ వర్షం

సాక్షి,పాడేరు: పాడేరు, జి.మాడుగుల, పెదబయలు మండలాల్లో గురువారం మధ్యాహ్నం చిరు జల్లులు కురిశాయి. అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 16 డిగ్రీలు,చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 16.5డిగ్రీలు, పాడేరుకు సమీపంలోని మినుములూరు కేంద్ర కాఫీబోర్డు వద్ద 17డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు గురువారం నమోదయ్యాయి. ఉదయం ఎనిమిది గంటల వరకు పొగమంచు కురిసింది. మధ్యాహ్నం నుంచి వాతావరణంలో మార్పు చోటుకుంది. పాడేరు పరిసర ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. రంపచోడవరం డివిజన్‌లో పలు చోట్ల భారీ వర్షం కురిసింది.

దారులన్నీ జన గోదారులయ్యాయి... అన్ని పల్లె మార్గాలు అడుగులో అడుగు వేస్తూ మాడుగుల చేరాయి... ఒక్కొక్కరిగా...గుంపులుగా... బృందాలుగా... సమూహాలుగా చేరి.. ప్రభంజనంగా మారారు.. గతుకుల బతుకులు మార్చి... పాలన సారథులుగా అందలమెక్కించిన సాధికార ప్రదాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలుగా ఘాట్ రోడ్డుకు భారీగా తరలివచ్చారు. పొలిమేర కూడా కనిపించనంతగా పోటెత్తారు...అభివృద్ధి చేసి చూపిస్తే అభిమానం ఇలాగే ఉంటుందన్నట్టుగా... అసంఖ్యాకంగా హాజరయ్యారు. సామాజిక సాధికార బస్సు యాత్రకు బ్రహ్మరథం పట్టారు. జరిగిన అభివృద్ధి, పాలనలో వచ్చిన మార్పులు.. ప్రభుత్వం, పార్టీలో అన్ని వర్గాల వారికి కేటాయించిన పదవులు, ఇతర వివరాలను మంత్రులు, అభిమాన నేతలు తెలపడంతో ఆసాంతం విన్నారు... హర్షధ్వానాలతో తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. వెరసి ప్రత్యర్థులు సైతం శభాష్ అన్నట్టుగా మాడుగుల నియోజకవర్గంలో బస్సు యాత్ర సాగింది...



సభకు భారీగా తరలివచ్చిన మహిళలు

• ప్రతిధ్వనించిన సామాన్యుడి గుండె చప్పుడు

ప్రభంజనం

వైఎస్సార్‌సీపీ శ్రేణుల బైక్ ర్యాలీ





బహిరంగ సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, వేదికపై మంత్రులు బొత్స సత్యనారాయణ, అమర్‌నాథ్, పీడిక రాజన్నదొర

- సామాజిక సాధికార బస్సు యాత్రలో వెల్లువెత్తిన అభిమానం
- జన సంద్రాలుగా మారిన మాడుగుల రహదారులు

సాక్షి, అనకాపల్లి: మాడుగుల నియోజకవర్గంలో గురువారం జరిగిన వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథంపట్టారు. వేలాది బైక్‌లు, ఆటోలు, వందలాది కార్లతో ర్యాలీగా యాత్ర సాగింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 53 నెలల పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేసిన మంచి ని వివరించడానికి నిర్వహించిన ఈ యాత్ర జైత్ర యాత్రలా జరిగింది. బస్సుయాత్ర, బహిరంగ సభల్లో వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్న దొర, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం, మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో కె.కోటపాడులో ఉదయం 10 గంటలకు ప్రారంభమైన బస్సు యాత్రకు ప్రజలు అడుగడుగున బ్రహ్మరథం పట్టారు. బస్సుయాత్ర ప్రారంభమైన ప్రాంతం మహిళల కోలాటాలు, జై జగన్..జై బూడి నినాదాలతో సందడిగా మారింది. ఈ యాత్ర సాగిన గ్రామాల ప్రధాన కూడళ్లలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ ఎత్తున బాణసంచా కాల్చి స్వాగతం పలికారు. మొదట కె.కోటపాడు శివాలయం వద్దకు చేరుకున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణలకు వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం బస్సు యాత్రను మంత్రి బొత్స సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. బస్సుయాత్ర కె.కోటపాడు, సింగన్నదొరపాలెం, సూర్రెడ్డిపాలెం, ఎ.కోడూరు, వారాడ, వి.సంతపాలెం, ఆనందపురం గ్రామాల మీదుగా దేవరాపల్లి మండలంలోకి ప్రవేశించింది. అంతకుమందు కె.కోటపాడులోని ఆస్పత్రిని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు వీరితో మాట్లాడుతూ సీఎం జగన్ ప్రమాణ స్వీకారం చేసిన తరువాత ఈ ఆస్పత్రి స్థాయిని 50 పడకలకు పెంచుతూ అదనపు భవన నిర్మాణాలకు, మౌలిక వసతులకు రూ.5.60 కోట్లను మంజూరు చేసినట్టు తెలిపారు. అదనపు భవనాల నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పన ఈ నెలాఖరునాటికి పూర్తయ్యేలా అధికారులు చర్యలను తీసుకోవాలని మంత్రి బొత్స సత్యనారాయణ సూచించారు.

ఎ.కోడూరులో వైఎస్సార్‌కు నివాళి

ఎ.కోడూరులో గల దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ బి.వి.సత్యవతి పూల మాలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎ.కోడూరు హైస్కూల్‌లో నాడు–నేడులో జరిగిన అభివృద్ధి పనుల వివరాలను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ హెచ్‌ఎం కామేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. నాడు-నేడు రెండవ దశలో మంజూరైన అదనపు భవనాలకు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేయనున్నట్టు మంత్రి బొత్స తెలిపారు. వీటితో పాటు మరో రెండు పాత తరగతి గదుల స్థానంలో నూతన భవనాల నిర్మాణాలకు నిధులను మంజూరు చేయనున్నట్టు హెచ్‌ఎంకు మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు.

దేవరాపల్లి మండలం మీదుగా మాడుగుల మండలానికి బస్సు యాత్ర సాగింది. మొత్తం 45 కిలోమీటర్ల మేర యాత్ర జరిగింది. అనంతరం మాడుగుల ఘాట్‌రోడ్డులో జరిగిన బహిరంగ సభకు వేలాది మంది తరలివచ్చారు. పార్టీ, ప్రభుత్వ పదవుల్లో ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ వర్గాలకు ఎన్నెన్ని పదవులు ఇచ్చారు. ఎంత ప్రాధాన్యం కల్పించారో మంత్రులు, ముఖ్యనాయకులు వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధిని విపులంగా తెలిపారు. మంత్రులు,నాయకుల ప్రసంగాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పెట్ల ఉమాశంకర్ గణేష్, నవరత్నాల అమలు కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్ నారాయణమూర్తి, మాడుగుల నియోకజవర్గ పరిశీలకులు ఉరుకూటి అప్పారావు, జీసీసీ చైర్‌పర్సన్ శోభాస్వాతి రాణి, మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణ రాజు, విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, విశాఖ సౌత్ నియోజకవర్గం పరిశీలకుడు వీసం రామకృష్ణ, చోడవరం నియోజకవర్గం పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావ్, మాజీ ఎమ్మెల్యే అల్లు భానుమతి, విశాఖ జోన్ సాంస్కృతిక విభాగం ఇన్‌చార్జి వంకాయల మారుతిప్రసాద్, నాయకులు సతీష్‌వర్మ, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



బస్సు యాత్రను ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, వై.వి.సుబ్బారెడ్డి



వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రులు బొత్స, ధర్మాన, రాజన్నదొర

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



సాంస్కృతిక ప్రదర్శన

మాడుగుల: వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వంగపండు ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జానపద కళాకారులు పాటలు, నృత్యాలతో హోరెత్తించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు జరిగిన మంచిని వివరిస్తూ సభా వేదికపై సుమారు రెండు గంటల పాటు గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటాలు, డీజే, తీన్మార్, తప్పెడ గుళ్లవంటి కార్యక్రమాలు అలరించాయి. సభా ప్రాంగణం వద్ద ప్రజలకు తాగు నీటితో పాటు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. పోలీసు యంత్రాంగం ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు వాహనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. దీంతో సభ జరిగిన తర్వాత ప్రజలు సురక్షతంగా గ్రామాలకు చేరుకున్నారు.



కె.కోటపాడు ఆస్పత్రిని సందర్శించిన బొత్స, వై.వి.సుబ్బారెడ్డి

ప్రత్యేక ఉప కలెక్టర్‌గా మురళీకృష్ణ



సాక్షి,పాడేరు: జిల్లాలో ఉన్న కోనేరు రంగారావు రిఫార్మ్స్ కమిటీ ప్రత్యేక ఉప కలెక్టర్‌గా పంచరెడ్డి మురళీకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లాలోని కొవ్వాడ అణుశక్తి ప్రాజెక్టు భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం ఇక్కడికి బదిలీ చేసింది. ముందుగా ఆయన మోదకొండమ్మతల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి జాయినింగ్ రిపోర్ట్ అందజేశారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న అరకు ఎమ్మెల్యే పాల్గుణ, తదితరులు

అరకులోయటౌన్: నియోజకవర్గ కేంద్రమైన అరకులోయలోని సీ-కాలనీలో గురువారం గ్యాస్ స్టౌవ్ మంటలు చెలరేగి పూరిల్లు దగ్ధమైంది. ప్రమాదవశాత్తు పెనుమాత్స వెంకటరావుకు చెందిన ఇంట్లో జరిగిన సంఘటన విషయం తెలుసుకున్న అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను పరామర్శించారు. వెంటనే ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. నష్ట పరిహారం అందిస్తామని బాధితులకు హామి ఇచ్చారు. ప్రభుత్వం నుంచి రావలసిన పరిహారం కోసం నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు అందించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు.ఎమ్మెల్యే వెంట ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణకుమార్, నాయకులు రామారావు, యాసీన్, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి విగ్రహ ఏర్పాటుకు స్థల కేటాయింపుపై నివేదిక



తహసీల్దార్‌ను కలిసిన వరలక్ష్మి

కొయ్యూరు: మండలంలోని కాకరపాడులో ఏర్పాటు చేయనున్న అల్లూరి విగ్రహానికి సంబంధించి మూడు సెంట్ల స్థలం ఇచ్చేందుకు వీలుగా కలెక్టర్‌కు సమగ్ర నివేదిక పంపించినట్లు తహసీల్దార్ తిరుమలరావు తెలిపారు. గురువారం ఆయనను జాతీయ అల్లూరి యువజన సంఘం కార్యదర్శి శ్యామల వరలక్ష్మి కలిశారు. జాతీయ రహదారి నిర్మాణ కారణంగా కాకరపాడు జంక్షన్‌లోని తొలగించనున్న అల్లూరి విగ్రహం ఏర్పాటుకు అవసరమైన స్థల కేటాయింపుపై ఆమె మాట్లాడారు. సీమ పాత యూకో బ్యాంకు స్థలంలో మూడు సెంట్లు కేటాయిస్తూ కలెక్టర్‌కు నివేదించామని తహసీల్దార్ పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

గూడెంకొత్తవీధి: మండలంలోని ఆర్‌బీ నగర్‌లో పోతురాజు (45) అనే వ్యక్తి గురువారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఇంటివద్దనే ఉరివేసుకుని మృతి చెందారు. అయితే అతని మృతిపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ అప్పలసూరి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపించామన్నారు. మృతికి గల కారణాలపై పూర్తిస్థాయిలో విచారిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

మరిన్ని అటవీ ఉత్పత్తుల కొనుగోలుకు చర్యలు

జీసీసీ ఎండీ సురేష్‌కుమార్



మాట్లాడుతున్న ఎండీ సురేష్‌కుమార్

రంపచోడవరం: గిరిజనుల నుంచి మరిన్ని అటవీ ఉత్పత్తుల కొనుగోలుకు చర్యలు తీసుకున్నట్లు జీసీసీ ఎండీ జి.సురేష్ కుమార్ తెలిపారు. స్థానిక జీసీసీ డీఎం కార్యాలయంలో గురువారం జీసీసీ మేనేజర్లతో అటవీ ఉత్పత్తుల కొనుగోలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సీజన్లో వివిధ రకాలైన అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేసి జీసీసీ మరింత ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి నెలా రేషన్ సరుకులు లబ్ధిదారులకు అందేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు. పాత డీఎం కార్యాలయం భవనం మరమ్మతులు చేయించి వాడుకలోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం పందిరిమామిడిలోని జీసీసీ పెట్రోల్ బంకును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జీసీసీ గొడౌన్, గ్యాస్ పంపిణీ పాయింట్లను పరిశీలించారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ సమావేశంలో డీఎం జి. పార్వతీశ్వరరావు, సీనియర్ మేనేజర్లు మర్ల నాగ వెంకట రాజారెడ్డి, కె. చంద్రశేఖర్, ఎం. విజయలక్ష్మి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సారాపై ఉక్కుపాదం

173 లీటర్లు ధ్వంసం



సారాతో పాటు సామగ్రిని ధ్వంసం చేస్తున్న ఏఎస్పీ జగదీష్ , సిబ్బంది

అడ్డతీగల: నాటుసారా తయారీ విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నట్టు రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ తెలిపారు. ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు గతంలో స్వాధీనం చేసుకున్న 173 లీటర్ల సారాతో పాటు తయారీకి ఉపయోగించే 1,210 కిలోల నల్ల బెల్లం,7 కిలోల అమ్మోనియంని అడ్డతీగలలో ధ్వంసం చేశారు.అడ్డతీగల, రాజవొమ్మంగి పోలీసు స్టేషన్ల పరిధిలో గతంలో పట్టుబడిన సారా, ఇతర సామగ్రిని అడ్డతీగల పోలీస్‌స్టేషన్ వద్ద శుక్రవారం గొయ్యి తీయించి ఆయా సామాగ్రిని ఎఎస్‌పి జగదీష్ అడహళ్లి మిగతా పోలీసు సిబ్బందితో కలిసి పూడ్చివేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ జగదీష్ మాట్లాడుతూ ఏజెన్సీలో ఎక్కడైనా సారా తయారీ చేసినా లేదా విక్రయించినా అటువంటి సమాచారం ఇచ్చిన వారి గురించి గోప్యంగా ఉంచుతామన్నారు. సారా తయారీకి ఎవరూ పాల్పడరాదన్నారు. అడ్డతీగల సీఐ వై.రాంబాబు, రాజవొమ్మంగి సిఐ గోపీ నరేంద్రప్రసాద్, అడ్డతీగల, వై.రామవరం, దుశ్చర్తి, గంగవరం, రాజవొమ్మంగి, జెడ్డంగి ఎస్ఐలు అప్పలరాజు, సంతోష్‌కుమార్, నరసింహారావు, జెఆర్‌బి రెడ్డి, నరేంద్రప్రసాద్, రఘునాథరావు పాల్గొన్నారు.

పలాస, రాయగడ పాసింజర్ రైళ్ల పునరుద్ధరణ

తాటిచెట్లపాలెం: కంటకాపల్లి–అలమండ మధ్య జరిగిన రైల్వే ప్రమాదం అనంతరం ట్రాక్ పునరుద్ధరణ పనులను రికార్డు సమయంలో పూర్తి చేసిన అధికారులు.. అంతే వేగంగా పలాస, రాయగడ రైళ్లను పునరుద్ధరించారు. ఈ మార్గంలో విద్యార్థులు, చిరు వ్యాపారులు, ఉద్యోగులు నిత్యం ఈ రైళ్లలోనే ప్రయాణిస్తుంటారు. ప్రమాదం కారణంగా ఈ రైళ్లను రద్దు చేశారు. డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ పర్యవేక్షణలో చేపట్టిన చర్యలతో ఈ నెల ఒకటి నుంచి విశాఖపట్నం–రాయగడ, గురువారం నుంచి విశాఖపట్నం–పలాస పాసింజర్ రైళ్లను పునరుద్ధరించినట్లు సీనియర్ డీసీఎం ఎ.కె త్రిపాఠి తెలిపారు.

కొనసాగిన విచారణ

రైలు ప్రమాదంపై డీఆర్‌ఎం కార్యాలయంలో రెండో రోజు కూడా కొనసాగింది. ముందుగా ప్రమాదంలో మరణించిన వారికి నివాళి అర్పిస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్, ఏడీఆర్‌ఎంలు సుధీర్ కుమార్ గుప్తా(ఇన్‌ఫ్రా), మనోజ్‌కుమార్ సాహూ (ఆపరేషన్స్), ఇతర అధికారులు పాల్గొన్నారు.